క్లుప్తంగా

70 క్వింటాళ్ల బియ్యం సీజ్

తగరపువలస: పద్మనాభం మండలం మద్ది గ్రామంలోని సాయిలక్ష్మి ఆగ్రో ఇండస్ట్రీస్ రైస్ మిల్లు నుంచి సీఎస్‌టీడీ శ్యామల గురువారం రూ.2.40 లక్షల విలువ చేసే 70 క్వింటాళ్ల బియ్యం సీజ్ చేశారు. స్టాక్ రిజిస్టర్‌లో ఉన్న బియ్యం కంటే మిల్లులో ఎక్కువ ఉన్నట్టు ఆమె గుర్తించారు. సీజ్ చేసిన బియ్యాన్ని ఆనందపురం మండలం శొంఠ్యాం రైస్ మిల్లుకు అప్పగించారు. తనిఖీల్లో డిప్యూటీ తహసీల్దార్ కిషోర్‌కుమార్, వీఆర్వో ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

రచ్చబండ తొలగించిన వారిపై చర్యలు



గతంలో రచ్చబండ ఉన్న ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కార్పొరేటర్ కొండబాబు

కొమ్మాది: జీవీఎంసీ 4వ వార్డు జేవీ అగ్రహారం పరిధి బోరపేటలో రచ్చబండ తొలగించిన వారిపై చర్యలు తీసుకుంటున్నట్లు తహసీల్దార్ వేణుగోపాల్ గురువారం తెలిపారు. స్థానికుల ఫిర్యాదు మేరకు రెవెన్యూ అధికారులు స్థలాన్ని పరిశీలించారని, అక్కడ రచ్చబండ తొలగించడం వాస్తవమేనని ఆయన పేర్కొన్నారు. అదే విధంగా రచ్చబండ తొలగించిన స్థలాన్ని కార్పొరేటర్ దొలపల్లి కొండబాబు గురువారం పరిశీలించారు. ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించే వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని ఆయన హెచ్చరించారు.

ఓపెన్ డేకు విద్యార్థులకు ఆహ్వానం

భీమునిపట్నం: భీమిలి ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులను ఈ నెల 20న నిర్వహించే ఓపెన్ డే కార్యక్రమానికి ఆహ్వానిస్తున్నట్లు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల గురువారం తెలిపారు. ఇక్కడి కళాశాలలో బీఏ, బీకాం, బీఎస్సీ డిగ్రీలో చదువుకునే అవకాశం ఉందని... అలాగే కంప్యూటర్ ల్యాబ్, ఇతర ల్యాబ్‌లు, లైబ్రరీతోపాటు అన్ని సదుపాయాలు ఉన్నాయని తెలిపారు. ఎంతో నైపుణ్యం, అనుభవం కలిగిన అధ్యాపకులు బోధిస్తున్నారని, కొత్త తరగతి గదులతో భవనం ప్రారంభమైందని, ఇది విద్యార్థులకు మరింత సదుపాయంగా ఉంటుందని తెలిపారు. ఓపెన్ డేకు జూనియర్ కళాశాల విద్యార్థులను ఆహ్వానించి ఇక్కడి సదుపాయాలు, నిర్వహణ విధానాన్ని తెలియపరుస్తామని వెల్లడించారు. తద్వారా వారు ఇంటర్ అనంతరం ఇక్కడ డిగ్రీలో చేరడానికి అవకాశం ఉంటుందని ఆమె తెలిపారు.

19 వరకే ధాన్యం కొనుగోలు

పద్మనాభం: మండలంలోని పొట్నూరు, బాందేవపురం, పాండ్రంగి, అనంతవరం, కృష్ణాపురం క్లస్టర్ల పరిధిలోని రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలుకు ఈ నెల 19 ఆఖరు తేదీగా ప్రభుత్వం ప్రకటించింది. ఈ తేదీలోగా రైతులు కేంద్రాలకు వచ్చి పేర్లు నమోదు చేసుకోవాలని ఏవో ఎమ్వీ సింహాచలం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 19 తర్వాత వచ్చిన ధాన్యం కొనుగోలు చేయడం, షెడ్యూల్ చేయడం జరగదని పేర్కొన్నారు.

అర్హులందరికీ సబ్సిడీ రుణాలు

తగరపువలస: జిల్లాలో వెనుకబడిన తెలుకలి కుటుంబాలకు సబ్సిడీ రుణాలు అందేలా కృషి చేస్తామని మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ అన్నారు. గురువారం భీమిలి మండలం తాళ్లవలసలో రూ.10 లక్షలు పీఎంఈజీపీ రుణంతో మంజూరైన ఆయిల్‌మిల్లును ఆయన తగరపువలస యూనియన్ బ్యాంకు బ్రాంచి మేనేజర్ ఆలీతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ ఇప్పటి వరకు 20 మంది లబ్ధిదారులకు రూ.2 కోట్ల రుణాలు మంజూరు చేయించామన్నారు. కార్యక్రమంలో రామకృష్ణానంద, రాంప్రసాద్, నగర తెలుకలి సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి జామి అప్పలరాజు, నరవ రాము, కోట్లపల్లి కూర్మనాథ్ పాల్గొన్నారు.

పచ్చని కొండపై రాబందులు..!

- చిప్పాడ కొండపై గ్రావెల్, రాళ్ల దందా
- తరలింపు వెనుక టీడీపీ రియల్టర్ల హస్తం
- చోద్యం చూస్తున్న రెవెన్యూ అధికారులు

తగరపువలస: భీమిలి మండలం చిప్పాడ, అమనాం పంచాయతీల నడుమ పచ్చని కొండ గ్రావెల్ తవ్వకాలతో ఎర్రబారిపోయింది. కొండ పాదాల వద్ద సాగు చేస్తున్న పంటలను తవ్వకాల కారణంగా చెలరేగిన బూడిద కబళించేస్తోంది. చుట్టుపక్కల అయిదు గ్రామ పంచాయతీల రైతుల మేకలు, గొర్రెలకు జీవనాధారమైన కొండపై యంత్రాలతో తవ్వకాల కారణంగా అటవీప్రాంతం మాయమైపోయింది. అడపాదడపా కుందేళ్లు, జింకలు, అడవి పందులతో అలరారే పచ్చని కొండకు ఇప్పుడు పెను ప్రమాదం ముంచుకొచ్చింది. రెవెన్యూ, సచివాలయ ఉద్యోగుల కళ్లెదుట నుంచే వేలాది లోడుల గ్రావెల్, రాళ్లు పక్కనే ఉన్న జిల్లా సరిహద్దులు సైతం దాటి వెళ్లిపోతున్నాయి. వీటిని పగలు రాత్రి అన్న తేడా లేకుండా తరలించేందుకు పంచాయతీ వెనుక భాగమైన ఇసుకబాట వైపు తాత్కాలిక రహదారులు



కొండ శివారు వరకు రాకపోకలు సాగిస్తున్న లారీలు



ట్రాక్టర్‌లోకి గ్రావెల్ లోడింగ్ చేస్తున్న జేసీబీ

ఏర్పాటు చేసుకున్నారు. చిప్పాడ పంచాయతీ నుంచి నేరుగా మూలకుద్దు పంచాయతీలో నిర్మాణుష్యంగా ఉండే లే – అవుట్ ద్వారా లారీలకు లారీలు గ్రావెల్, రాళ్లు తరలిపోతుండడంతో పంచాయతీ పాలకవర్గం అసహనం, నిస్సహాయత వ్యక్తం చేస్తోంది. వీటి తరలింపు వెనుక మూలకుద్దు, చిప్పాడ పంచాయతీల్లోని తెలుగుదేశం పార్టీకి చెందిన రియల్టర్ల హస్తం ఉందని ఆరోపిస్తున్నారు.

లారీ గ్రావెల్ రూ.3 వేలు...
ట్రాక్టర్ రాళ్లు రూ.4,500

కొండపై నుంచే గ్రావెల్, రాళ్ల వ్యాపారం చేస్తున్న అక్రమార్కులు అక్కడే లారీలు, జేసీబీ, ట్రాక్టర్లతో



గ్రావెల్ తరలింపునకు గెడ్డలో నుంచి మూలకుద్దు లే అవుట్ వైపు వేసిన రహదారి



కొండపై నుంచి రాళ్లు, గ్రావెల్ తరలింపునకు సిద్ధంగా లారీలు

తిష్ట వేశారు. భవన నిర్మాణ యజమానుల అవసరాల మేరకు మూడు యూనిట్ల గ్రావెల్ లారీ రూ.2700 నుంచి రూ.3 వేలకు, ఒక యూనిట్ రాళ్ల ట్రాక్టర్ రూ.4500లకు విక్రయించి నేరుగా తరలిస్తున్నారు.

ఈ తతంగమంతా తెలిసినా పంచాయతీ, రెవెన్యూ, సచివాలయ అధికారులు ఎదురు చెప్పకుండా తమ వాటాలు తీసుకుంటున్నట్టు స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇక పంచాయతీని ఆనుకుని విజయనగరం జిల్లాలోని గ్రామాలు, జీవీఎంసీ భీమిలి జోన్, మండల పరిధిలో రియల్ ఎస్టేట్ వ్యాపారులకు చెందిన పల్లపు భూములను గ్రావెల్‌తో నింపడానికి ఒప్పందాలు చేసుకున్నారు. లోతు, పొడవు, వెడల్పు ఆధారంగా ఎకరాకు రూ.15 లక్షల వరకు వసూలు చేస్తున్నారు. ఏడాదిగా వేలాది లోడ్ల గ్రావెల్, రాళ్లు తరలించుకుపోయారని చిప్పాడ, మూలకుద్దు పంచాయతీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అడ్డుకట్టు వేయకపోతే కష్టమే..

వేలాది ఎకరాల విస్తీర్ణంలో చిప్పాడ – మూలకద్దు పంచాయతీల నడుమ విస్తరించిన ఈ కొండపై పచ్చదనం ఆకర్షించేది. ఇక కొండపై కురిసిన వర్షం కారణంగా చుట్టూ ఉన్న కందకాలు, చెరువుల్లో ఏడాది పొడవునా నీరు నిల్వ ఉండేది. దీంతో బావులు, బోర్లలో సాగు, తాగునీరు పుష్కలంగా అందుబాటులో ఉండేది. ఇప్పుడు కొండపై జరుగుతున్న తవ్వకాలకు అడ్డుకట్ట వేయకపోతే చుట్టుపక్కల పంచాయతీల ప్రజలకు భవిష్యత్‌లో తాగు, సాగునీటికి కరువు ఏర్పడే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొండపై నుంచి గ్రావెల్, రాళ్లు తరలించకుండా కందకాలు తవ్వి తాత్కాలిక రహదారులను మూసివేయాలని కోరుతున్నారు. ఇకపై తవ్వకాలు జరుగకుండా రెవెన్యూ, వలంటీర్, సచివాలయ సిబ్బందితో నిఘా ఏర్పాటు చేయాలని చిప్పాడ, మూలకుద్దు పంచాయతీల ప్రజలు కోరుతున్నారు.

వైభవంగా రాట మహోత్సవం

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు ఎండాడలోని శ్రీ కోదండ రామాలయం, శిర్డీ సాయి సహిత గణపతి పశుపతి నాథేశ్వరస్వామి దేవాలయంలో శివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని గురువారం కల్యాణ రాట మహోత్సవం వైభవంగా నిరిహించారు. శుక్రవారం స్వామి వారి నిత్య అర్చన, శనివారం మహాశివరాత్రి సందర్భంగా స్వామికి ఏకవార అభిషేకాలు, మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, సాయంత్రం అత్యంత వైభవంగా శ్రీ పార్వతి పరమేశ్వరుల కల్యాణం నిర్వహించనున్నట్లు అర్చకులు సుసరాపు రామకృష్ణ శర్మ తెలిపారు.

దుప్పట్లు, పండ్లు పంపిణీ



దుప్పట్లు, పండ్లు, రొట్టెలు పంపిణీ చేస్తున్న గ్రూప్ ప్రతినిధులు

తగరపువలస: పద్మనాభం మండలం రేవిడి పంచాయతీ పరిధిలో గురువారం టీచర్స్ హెల్ప్ గ్రూప్ ప్రతినిధులు రూ.20వేల విలువైన దుప్పట్లు, రొట్టెలు, పండ్లను పేదలు, వితంతువులు, వృద్ధులకు పంపిణీ చేశారు. ఈ మొత్తాన్ని టీచర్స్ హెల్ప్ గ్రూప్ సభ్యులు సమకూర్చారు. కార్యక్రమంలో గ్రూప్ గౌరవ అధ్యక్షుడు ముత్యాలరావు, ఉపాధ్యక్షుడు సత్యబాపిరాజు, దాత ఎం.అప్పారావు, శ్రీనివాస సేవా సంఘం ఉపాధ్యక్షుడు ఎం.చిరంజీవి, గ్రూప్ అధ్యక్షుడు రామకృష్ణ, ప్రతినిధులు హరీష్, సురేష్ పాల్గొన్నారు.

మాటిస్తే మడమ తిప్పని సీఎం జగన్

ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

పద్మనాభం: మాటిస్తే మడమ తిప్పని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. ఇదే విషయాన్ని గృహ సారథులు, సచివాలయ కన్వీనర్ల ద్వారా మార్చి 18 నుంచి ప్రారంభమయ్యే ''మా నమ్మకం నువ్వే జగన్'' కార్యక్రమం ద్వారా ఇంటింటా ప్రచారం చేయాలని కోరారు. మండలంలోని రెడ్డిపల్లి ప్రభుత్వ కల్యాణ మండపంలో సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో టీడీపీ పాలనలోని లోపాలు, చంద్రబాబు వైఫల్యాలు, జన్మభూమి కమిటీల అవినీతి, మహిళలు, రైతులకు చేసిన మోసాలను గుర్తు చేస్తూ ఎస్సీ, ఎస్టీ, బీసీలను చంద్రబాబు దూషించిన సంఘటనలు ప్రజలకు వివరించాలన్నారు. ఈ మూడున్నరేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో పొందిన లబ్ధిని మరోమారు గుర్తు చేయాలన్నారు. పొరపాటున చంద్రబాబుకు అవకాశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

ఇస్తే ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు తూట్లు పొడుస్తారని చెప్పాలని కోరారు. రాష్ట్రంలో 1.25 కోట్ల కుటుంబాలకు రూ.1.25 లక్షల కోట్ల విలువైన సంక్షేమ పథకాలు చేరవేసినట్టు తెలియజేయాలన్నారు.

రాష్ట్రంలో 39 లక్షల మందికి ఇళ్ల పట్టాలు

రాష్ట్రంలో వైఎస్ రాజశేఖరరెడ్డి 25 లక్షల మందికి ఇళ్లు కట్టిస్తే ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 39 లక్షల మందికి ఇంటి పట్టాలు ఇచ్చి ఇళ్ల నిర్మాణాలు చేపట్టారన్నారు. చంద్రబాబు గత అయిదేళ్ల పాలనలో ఒక్కరికైనా ఇల్లు కట్టించలేదని ప్రజలకు చెప్పాలన్నారు. ప్రతిపక్షాలు చేస్తున్న దుష్ప్రచారాలు తిప్పికొట్టేలా ప్రజలకు వైఎస్సార్‌సీపీ సంక్షేమ పథకాలు వివరించి అవగాహన కలిగించాలన్నారు. ఇంటింటికీ వెళ్లి వారి ద్వారా 82960 82960 నంబర్‌కు మిస్ట్ కాల్ ఇప్పించి భవిష్యత్తుపై భరోసా కల్పించాలన్నారు. సమావేశంలో భీమిలి ఏఎంసీ చైర్మన్ ఎలమంచిలి సూర్యనారాయణ, ఎంపీపీ కంటుబోతు రాంబాబు, జెడ్పీటీసీ సభ్యుడు సుంకర గిరిబాబు, పార్టీ మండల అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు, వైస్ ఎంపీపీ ఈర్ల రాజేశ్వరి, సర్పంచ్ సిగల ఆదిలక్ష్మి, శిరిగుడి ఆదిబాబు, గొర్రెపాటి ఎర్రిబాబు, బుగత సత్యనారాయణ, ఈర్ల ఈశ్వరరావు, సుంకర బంగారప్పుడు, బోని సన్యాసినాయుడు, మొకర అప్పలనాయుడు, బోలె అప్పలనాయుడు, బేపల గురునాయుడు, గేదెల చంద్రరావు, కోండ్రోతు శ్రీనివాసరావు, బూసరోతు అప్పారావు, తాలాడ నరసింహనాయుడు, తాలాడ పద్మనాభం, సాగి కృష్ణమూర్తి రాజు, నల్లి సన్యాసప్పుడు తదితరులు పాల్గొన్నారు.

కనులపండువగా పార్వతీ నీలకంఠేశ్వరుల కల్యాణం

తగరపువలస: స్థానిక సత్యనారాయణస్వామి కొండపై గీతామందిరం వద్ద గురువారం పార్వతీ నీలకంఠేశ్వరస్వామి కల్యాణం కన్నుల పండువగా సాగింది. ప్రధాన అర్చకుడు ఏడిద వివేకానందశర్మ ఆధ్వర్యంలో నారాయణాచార్యులు ఈ కల్యాణ వేడుకలు జరిపించారు. 21 జంటలు కల్యాణంలో పాల్గొనగా మహాదేవుడు, లోకపావని కల్యాణం శాస్త్రోక్తంగా జరిపించారు. బోర గురువులు రెడ్డి, వెంకటలక్ష్మి దంపతులు పట్టువస్త్రాలు బహూకరించారు. భక్తులు 11 రకాల సారె సమర్పించారు. కల్యాణ వేడుకల అనంతరం 3 వేల మందికి నారాయణసేవ నిర్వహించారు. సాయంత్రం వీధుల్లో పల్లకీ ఉత్సవం నిర్వహించారు. కల్యాణ వేడుకలకు గీతా మందిరం ప్రతినిధులు, అర్చకులు ఏడిద కార్తీక్‌శర్మ, భానుప్రకాష్ తదితరులు సహకరించారు.



పార్వతీ నీలకంఠేశ్వరస్వాములకు కల్యాణం జరిపిస్తున్న పురోహితులు

మత్స్యకార సహకార సంఘానికి 1.90 లక్షల చేప పిల్లలు

తగరపువలస: ఆంధ్రప్రదేశ్ ఇంటిగ్రేటెడ్ ఇరిగేషన్ అండ్ అగ్రికల్చర్ ట్రాన్స్‌ఫర్మేషన్ ప్రాజెక్ట్, ప్రపంచ బ్యాంకు సహకారంతో మత్స్యశాఖ గురువారం రెండు చెరువుల్లో 1.90 లక్షల చేపపిల్లలు విడుదల చేసింది. పద్మనాభం మండలం పాండ్రంగి మత్స్యకార సహకార సంఘానికి చెందిన ఆనందపురం మండలం పెద్దిపాలెం దత్తప్ప చెరువులో 75 వేలు, పద్మనాభం మండలం రేవిడి పంచాయతీ యానాద్రి చెరువులో 1.15లక్షల చేప పిల్లలు నూరుశాతం సబ్సిడీతో విడుదల చేశారు. మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ జి.విజయ మాట్లాడుతూ శాస్త్రీయ పద్ధతిలో చేపల పెంపకం చేపడితే లాభదాయకమన్నారు. పెంపకందారులు ఎప్పటికప్పుడు మత్స్యశాఖ నుంచి సూచనలు, సలహాలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మత్స్యశాఖ అభివృద్ధి అధికారి డి.లావణ్య, మత్స్యశాఖ సహాయ సంచాలకులు తులసి, కిషోర్, మనూష, వాసుపల్లి ఎల్లాజీ తదితరులు పాల్గొన్నారు.



రేవిడి యానాద్రి చెరువులో చేపపిల్లలు విడుదల చేస్తున్న మత్స్యశాఖ అధికారులు

ఆడపిల్లలను చదివించండి

తగరపువలస: పదో తరగతి తర్వాత ఆడపిల్లలకు పెళ్లి, మగపిల్లలకు పని కాకుండా ఇంటర్మీడియట్, పాలిటెక్నిక్ తదితర కోర్సుల్లో చేర్పించి చదివించాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ సూచించారు. గురువారం ఆమె భీమిలి మండలం మజ్జివలస జెడ్పీ హైస్కూల్, ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. ముందుగా ఉపాధ్యాయుల పనితీరు, రికార్డులు, విద్యార్థుల అభ్యసన స్థాయిని పరిశీలించారు. మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేసి ఎలా ఉందంటూ విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాఠశాలకు గైర్హాజరైన మజ్జివలసకు చెందిన విద్యార్థులు భవాని, రాజేష్, గణేష్ ఇంటికి వెళ్లి వారి తల్లిదండ్రులతో మాట్లాడారు. శుక్రవారం నుంచి వారంతా పాఠశాలల్లో ఉండే బాధ్యత తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, గ్రామ పంచాయతీ ప్రతినిధులు, సచివాలయ సిబ్బంది తీసుకోవాలన్నారు. ఆమెతోపాటు భీమిలి డైట్ అధ్యాపకుడు గొట్టేటి రవిరాజు, ప్రధానోపాధ్యాయుడు మురళీమోహన్ పట్నాయిక్, కృష్ణం రాజుపేట ఉపాధ్యాయుడు గొట్టిపల్లి సత్యనారాయణ, సీఆర్పీ సూర్యనారాయణ తదితరులు ఉన్నారు.



మజ్జివలసలో విద్యార్థిని ఇంటికి వెళ్లి మాట్లాడుతున్న డీఈవో చంద్రకళ

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

మధురవాడ: ఏపీ ట్రాన్స్‌కో మధురవాడ, కొమ్మాది విద్యుత్ సబ్ స్టేషన్ల పరిధిలోని రేవళ్లపాలెం, ఎన్టీఆర్ కాలనీ, ఐటీ సెజ్ హిల్ నంబర్ – 1 తదితర 11 కేవీ ఫీడర్ల పరిధిలోని ప్రాంతాల్లో నిర్వహణ, మరమ్మతులు చేపడుతున్నందున శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఆపరేషన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎ.కిరణ్‌కుమార్ చెప్పారు. శ్రీవల్లినగర్, చంద్రంపాలెం హైస్కూల్ ఏరియా, రేవళ్లపాలెం విలేజ్, రేవళ్లపాలెం రోడ్డులోని పీఎంపాలెం పోలీస్ స్టేషన్, బక్కన్నపాలెం 100 అగుడుల రోడ్డు, కే 1, కే 2, కే 3 కాలనీలు, బక్కన్నపాలెం విలేజ్, పోలీస్ బెటాలియన్, ఎన్టీఆర్ కాలనీ, రైల్వే లే అవుట్, లచ్చిరాజు లే అవుట్, అయోధ్యనగర్, ఆర్టీసీ కాలనీ, మానం ఆంజనేయులునగర్, నగరంపాలెం, సాక్షి పత్రిక ప్రెస్ ఏరియాలో సరఫరా నిలిచిపోతుందని తెలిపారు.

శిల్పారామంలో చేనేత ఉత్పత్తుల మేళా ప్రారంభం

పీఎం పాలెం: చేనేత కళాకారులను ప్రోత్సహించి, వారి ఆర్థికాభివృద్ధికి సహకారం అందించాలని శిల్పారామం పరిపాలన అధికారి విశ్వనాథరెడ్డి కోరారు. చేనేత ఉత్పత్తుల ప్రదర్శన, విక్రయాల మేళాను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మేళాలో సుమారు 50 స్టాల్స్ ఏర్పాటు చేశారన్నారు.

రాష్ట్ర వ్యాప్తంగా పేరు పొందిన చేనేత ఉత్పత్తులు ఈ స్టాల్స్‌లో లభిస్తాయని తెలిపారు. స్టాల్స్ నిర్వాహకులు బి.సురేష్ మాట్లాడుతూ తక్కువ లాభాలు వేసుకుని చేనేత వస్త్రాలు విక్రయిస్తున్నామని పేర్కొన్నారు. నాణ్యమైన జంబుఖానాలు, కార్పెట్లు, అన్నిరకాల చేనేత వస్త్రాలు ప్రదర్శనలో ఉంచామని తెలిపారు.



శిల్పారామంలో చేనేత ఉత్పత్తులు పరిశీలిస్తున్న విశ్వనాథరెడ్డి తదితరులు

శ్రీనివాసరెడ్డికి భారతీయ సమాజరత్న అవార్డు

తగరపువలస: స్థానిక వుయ్ కేర్ యూ సొసైటీ ప్రతినిధి వెంపాడ శ్రీనివాసరెడ్డికి మహారాష్ట్రలోని పూణేకు చెందిన గ్లోబల్ స్కాలర్‌షిప్ ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో 2023 భారతీయ సేవా పురస్కారం భారతీయ సమాజరత్న అవార్డు లభించింది. ఈ నెల 12న గోవాలోని పార్క్ రెజీస్‌లో ఈ అవార్డును పద్మశ్రీ డాక్టర్ బాత్రాస్ చేతుల మీదుగా బహూకరించారు. వుయ్ కేర్ యూ సొసైటీ, హెల్పింగ్ హ్యాండ్స్ ద్వారా దీనులకు అండగా నిలుస్తున్న శ్రీనివాసరెడ్డికి అవార్డు రావడంతో పలువురు అభినందించారు.



పద్మశ్రీ బాత్రాస్ నుంచి అవార్డు స్వీకరిస్తున్న వెంపాడ శ్రీనివాసరెడ్డి

ఆటో బోల్తాపడి ఒకరు దుర్మరణం

తగరపువలస: ఆనందపురం మండలం బోని గ్రామానికి చెందిన కనకల రాంబాబు(46) అనే వ్యక్తి పద్మనాభం మండలం రేవిడి సమీపాన యానాద్రి చెరువు వద్ద ఆటో బోల్తా పడిన సంఘటనలో తీవ్రంగా గాయపడి మృతి చెందాడు. రాంబాబు రోజూ బోని నుంచి పద్మనాభం మండలం రేవిడికి సైకిల్‌పై వస్తాడు. అక్కడి నుంచి ఆటోలో తగరపువలస వెళ్లి టీ దుకాణంలో పనిచేస్తాడు. అదేవిధంగా బుధవారం ఆటోలో వెళ్తుండగా డ్రైవర్ కొయ్య గౌరి అజాగ్రత్త, అతివేగానికితోడు కుక్కలు అడ్డురావడంతో సడన్ బ్రేకులు వేయగా బోల్తాపడింది. ఈ ప్రమాదంలో రాంబాబు నేలమీద పడిపోవడంతో బలమైన గాయాలయ్యాయి. వెంటనే రేవిడి పీహెచ్‌సీకి తరలించగా మృతి చెందాడు. మృతుని భార్య కామేశ్వరి ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ నక్కా శ్రీనివాసరావు దర్యాప్తు చేస్తున్నారు. ఆటోలో ప్రయాణిస్తున్న బొట్ట బంగారి అనే మహిళ నుదిటిపై గాయాలు కాగా 108లో విజయనగరం మహారాజా ఆస్పత్రికి తరలించారు.

హెల్మెట్ ధారణతో ప్రాణానికి రక్ష

తగరపువలస: హెల్మెట్ ధారణపై జాతీయ రహదారిపై పలుచోట్ల ద్విచక్ర వాహనదారులకు భీమిలి ట్రాఫిక్ పోలీసులు గురువారం ప్లకార్డులతో అవగాహన కలిగించారు. గత ఏడాది హెల్మెట్ ధరించకుండా ద్విచక్ర వాహనాలు నడిపి దేశంలో, రాష్ట్రంలో, జిల్లాలో ప్రమాదాలకు గురై చనిపోయిన వారి వివరాలు తెలియజేశారు. ప్రమాదాలు జరిగినప్పటికీ హెల్మెట్ ధరించడం వల్ల చాలా వరకు ప్రాణాలు నిలబడతాయన్నారు. హెల్మెట్ లేకుండా జరిమానాలకు గురయ్యే బదులు కొనుగోలు చేసి సురక్షితంగా ఇంటికి చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ చింతలపూడి చిరంజీవి, సిబ్బంది పాల్గొన్నారు.



వేంకటేశ్వర మెట్ట వద్ద వాహనదారులకు అవగాహన కలిగిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

రాష్ట్ర స్థాయి పోటీలకు శొంఠ్యాం విద్యార్థుల ప్రాజెక్ట్

ఆనందపురం : మండలంలోని శొంఠ్యాం ఉన్నత పాఠశాల విద్యార్థులు రూపొందించి ప్రదర్శించిన ప్రాజెక్ట్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ మేరకు గురువారం పాఠశాలలో విద్యార్థులను ఉపాధ్యాయులు, స్థానిక నాయకులు అభినందించారు. ఈ నెల 14, 15న చిన వాల్తేరులోని కేడీపీఎం ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సైన్స్ ఎగ్జిబిషన్‌లో శొంఠ్యాం హైస్కూల్‌కు చెందిన 8వ తరగతి విద్యార్థులు వై.సాయి, జి.ప్రకాష్ పాల్ రూపొందించిన గ్యాస్ కట్టర్ ప్రాజెక్ట్ అందరినీ ఆకట్టుకొని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ మేరకు విద్యార్థులను సర్పంచ్ లెంక రాంబాబు, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్, స్పైక్ మార్షల్ ఆర్ట్స్ జిల్లా ఉపాధ్యక్షుడు బొద్దపు బంగారురాజు, హెచ్‌ఎం కె.వి.సుబ్బారావు అభినందించి సత్కరించారు. విద్యార్థులను ప్రోత్సహిస్తూ ఉపాధ్యాయులు జయశ్రీరాణి, పద్మ నగదు బహుమతులు అందజేశారు.



విద్యార్థులతో ఉపాధ్యాయులు

గర్భిణులకు రక్త పరీక్షలు

తగరపువలస: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, చైల్డ్‌ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీమ్, తాళ్లవలస పీహెచ్‌సీ సంయుక్తంగా భీమిలి మండలం చిప్పాడ, మజ్జిపేటలో ఆరోగ్యంపై గురువారం అవగాహన కలిగించారు. 42 మంది గర్భిణులకు రక్తపరీక్షలు చేశారు. సర్పంచ్‌లు వెంపాడ రమావతి, మజ్జి సూరినాయుడు, ఎంఎల్‌హెచ్‌పీ రాజీ, లింక్ వర్కర్ ఎం.జ్యోతి, ఏఎన్ఎం రమణమ్మ పాల్గొన్నారు.

ఎస్‌వోఎస్ సేవా కార్యక్రమాలు

పద్మనాభం: భీమిలి ఎస్‌వోఎస్ ఆధ్వర్యంలో పద్మనాభం మండలం రేవిడి వెంకటాపురంలో కుటుంబ బలోపేత కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఇందులో భాగంగా పశువుల పరిరక్షణ, యాజమాన్య పద్ధతులపై పాడి రైతులకు అవగాహన కలిగించారు. పాండ్రంగి పశువైద్యురాలు అనుపమ రైతులతో మాట్లాడుతూ మేలుజాతి పశువులు, పాడి ఆవులను కొనుగోలు చేసేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎస్‌వోఎస్ ప్రాజెక్ట్ ఇన్‌చార్జి కర్రోతు దుర్గరాజు మాట్లాడుతూ అమూల్ కేంద్రానికి పాలు పోస్తే అదనంగా లీటర్‌కు రూ.4 ప్రోత్సాహకం లభిస్తుందన్నారు. ఈ సందర్భంగా వెంకటాపురం కళ్లాల్లో ఉన్న 150 మంది విద్యార్థులకు స్టేషనరీ అందించారు. కార్యక్రమంలో ఎస్‌వోఎస్ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ వి.సత్యనారాయణ, సచివాలయ సిబ్బంది, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

అనంతుని కల్యాణోత్సవాలకు ఆహ్వానం

పద్మనాభం: పద్మనాభంలో మార్చి 3 నుంచి జరగనున్న అనంత పద్మనాభ స్వామి తిరు కల్యాణ ఉత్సవాలకు రూపాకుల రవికుమార్ గురువారం త్రిదండి దేవనాథ రామానుజ జీయర్ స్వామిని ఆహ్వానించారు. భీమిలి బీచ్‌రోడ్డులోని వారిజ ఆశ్రమంలో స్వామీజీని రవి కుమార్ కలిశారు. ఈ సందర్భంగా జీయర్ స్వామి మాట్లాడుతూ కల్యాణ ఉత్సవాలకు హాజరవుతానని తెలిపారు.

తెప్పోత్సవం నిర్వహించే చెరువు పరిశీలన

తగరపువలస: అనంత పద్మనాభస్వామి తిరు కల్యాణ మహోత్సవాల్లో భాగంగా మార్చి 5న స్వామి వారి తెప్పోత్సవం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా తెప్పోత్సవం నిర్వహించే చెరువులో జరుగుతున్న అభివృద్ధి పనులను గురువారం సాయంత్రం ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు పరిశీలించారు.